# ఈనాడు
## తూర్పుగోదావరి

సోమవారం 23 ఏప్రిల్ 2018 .. 16 పేజీలు




కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో విద్యార్థులు ఆదివారం ఎంసెట్ రాశారు. పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థినులు

-16లో







రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాలలో ఎంసెట్‌కు హాజరైన విద్యార్థులు ● పరీక్ష కేంద్రంలోకి వెళ్లేందుకు బారులు తీరిన విద్యార్థులు ● కాకినాడ రాజీవ్‌గాంధీ కంప్యూటర్ సెంటర్‌లో పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు

## జేఎన్‌టీయూకే నిర్వహణలో
# పక్కాగా ఎంసెట్

### మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రశంస

**కాకినాడ, న్యూస్‌టుడే:** ఎలాంటి అపోహలకు తావులేకుండా గత మూడేళ్లుగా ఎంసెట్‌ను జేఎన్టీయూకే నిర్వహిస్తోందని విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అభినందించారు. నాలుగోసారి ఎంసెట్ దిగ్విజయంగా నిర్వహించి అనుకున్న విధంగానే ఫలితాలను ప్రకటించి ఇంజినీరింగ్ తరగతులను త్వరగా ప్రారంభించాలని వర్సిటీ అధికారులను కోరారు. ఏపీ ఎంసెట్ ఆంధ్రప్రదేశ్‌తో పాటు హైదరాబాద్‌లో ఆదివారం ప్రారంభమైంది. ఈనెల 24వరకు ఇంజినీరింగ్, 25న అగ్రికల్చర్ పరీక్షలు జరుగుతాయి. తొలిరోజు పరీక్ష సెట్ కోడ్, పాస్‌వర్డ్‌ను మంత్రి గంటా శ్రీనివాసరావు కాకినాడ జేఎన్టీయూలో ఆదివారం ప్రకటించి మాట్లాడారు. ఎంసెట్ నిర్వహించేందుకు రాష్ట్రంలోని పలు వర్సిటీలు ముందుకువచ్చినప్పటికీ జేఎన్టీయూకే పనితీరును దృష్టిలో ఉంచుకొని ఎంసెట్ బాధ్యతలను అప్పగించామన్నారు. ఎంసెట్ కన్వీనర్ సీహెచ్. సాయిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి ఎస్. రామకృష్ణారావు, అమలాపురం ఎంపీ పండుల రవీంద్రబాబు, కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కాకినాడ గ్రామీణం ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, వర్సిటీ రెక్టార్ పూర్ణానందం, రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు, ఇతర డైరెక్టర్లు పాల్గొన్నారు.



సమయం లేదు మిత్రమా

### తొలిరోజు ప్రశాంతం

ఎంసెట్ పరీక్ష జిల్లాలో తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. పరీక్షా కేంద్రాలకు ఒక గంట ముందే అనుమతివ్వడంతో అభ్యర్థులు ముందుగానే పరీక్ష తరగతి గదికి చేరుకున్నారు. అమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరంలో జరిగిన ఈ పరీక్ష ఉదయం 10గంటల నుంచి 1గంట వరకు, మధ్యాహ్నం 2.30నుంచి 5.30 వరకు జరిగింది. తొలిరోజు 2,556మంది హాజరవ్వాల్సిఉండగా 2,453 మంది హాజరయ్యారు.

### రాజమహేంద్రవరంలో...

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించి ఎంసెట్-2018 అర్హత పరీక్షలు ఆదివారం రాజమహేంద్రవరంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్న ఈ పరీక్ష రాజమహేంద్రవరంలోని రాజీవ్ గాంధీ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించారు. ఉదయం జరగాల్సిన పరీక్షకుగాను మొత్తం 960 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 920 మంది హాజరయ్యారు. 40 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షలకు 960 మంది విద్యార్థులకుగాను 924 మంది విద్యార్థులు హాజరయ్యారు. 36 మంది హాజరుకాలేదు. ఎంసెట్ నేపథ్యంలో పరీక్ష కేంద్రం వద్ద సందడి వాతావరణం నెలకుంది. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా కేంద్రం వద్దకు దూర ప్రాంతాల నుంచి రావడంతో పరీక్ష ముగిసే వరకూ తల్లిదండ్రులు పిల్లల కోసం వేచి ఉన్నారు. మధ్యాహ్నం పరీక్ష జరిగిన సమయంలో కళాశాల వద్ద రహదారిపై ట్రాఫిక్ సమస్యలు నెలకొన్నాయి.



ఆల్ ది బెస్ట్ చెప్పుకుంటున్న కవలలు



జేఎన్టీయూకేలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న చిత్రం